సాక్షి మంచిర్యాల

మంగళవారం | 14 | అక్టోబర్ | 2025



సంక్షోభంలో శ్రీరాంపూర్ ఓసీపీ
శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గని(ఓసీపీ) తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. ఓబీ పనులు చేసే కాంట్రాక్టు సంస్థలు చేతులెత్తేయడంతో బొగ్గు ఉత్పత్తి ఆగిపోయింది. 10లో▸



మళ్లీ బెబ్బులి అలజడి
రెండేళ్లుగా దహెగాం మండలంలో పులి అలజడి లేదు. సోమవారం పెసరికుంట బస్టాప్ సమీపంలోని పొలాల వద్ద రైతులు పులి పాదముద్రలను గుర్తించారు. 10లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 29.0/24.0
ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

ఇందన్‌పల్లి ఇంచార్జి రేంజ్ అధికారిగా లక్ష్మీనారాయణ


లక్ష్మీనారాయణ

జన్నారం: ఇందన్‌పల్లి ఇంచార్జి రేంజ్ అధికారిగా కుశ్నలపల్లి రేంజ్ డీఆర్వో లక్ష్మీనారాయణను నియమిస్తూ ఉన్నత అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందన్‌పల్లి రేంజ్ అధికారి శ్రీధరచారి ఇటీవల సస్పెండ్ కావడంతో ఆయనకు ఇంచార్జి బాధ్యతలు అప్పగించారు. కాగా, లక్ష్మీనారాయణ గతంలో జన్నారం డివిజన్‌లో సెక్షన్ అధికారిగా విధులు నిర్వర్తించారు.

నేడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు రాక

వేమనపల్లి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మంగళవారం మండలంలోని నీల్వాయికి రానున్నారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 10న ఆత్మహత్యకు పాల్పడిన పార్టీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్ కుటుంబాన్ని ఆయన పరామర్శిస్తారు. అనంతరం రాష్ట్ర బీజేపీ నాయకత్వ బృందంతో కలిసి రామగుండం పోలీసు కమిషనర్‌ను కలువనున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

మంచిర్యాలక్రైం: పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. 'డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్ర, విద్యార్థులు డ్రగ్స్‌కు ఎలా దూరంగా ఉండాలి' అనే అంశంపై తెలుగు, ఇంగ్లిషు, ఉర్దూ భాషల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. 6వ తరగతి నుంచి పీజీ విద్యార్థులు పాల్గొనవచ్చని, వ్యాసాలను ఈ నెల 28లోగా సమర్పించాలని పేర్కొన్నారు. ప్రతిభావంతులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేసి, ముగ్గురిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామని తెలిపారు. వ్యాసాలను 500 పదాలకు మించకుండా పీడీఎఫ్, ఇమేజ్ ఫార్మాట్‌లో పంపించాలని సూచించారు.https:// forms. gle/ jaWLdt2 yhNrMpe3 e అ లింకు ద్వారా పంపించాలని తెలిపారు.

'హామీల అమలుపై చేతెలెత్తేసిన కాంగ్రెస్'


బాకీ కార్డులు పంపిణీ చేస్తున్న దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు అబద్దపు హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన అనంతరం వాటిని అమలు చేయకుండా చేతులెత్తేసిందని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు విమర్శించారు. జిల్లా కేంద్రంలోని 43వ డివిజన్ రాంనగర్ ఏరియాలో బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం ఆధ్వర్యంలో ఇంటింటికీ కాంగ్రెస్ బాకీ కార్డులను మాజీ ఎమ్మెల్యే పంపిణీ చేశారు. రైతులు, నిరుద్యోగులు, మహిళలు, అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలతో మేలు జరుగుతుందని ఓట్లు వేసి గెలిపిస్తే, ఆ హామీలను తుంగలో తొక్కి మోసం చేసిందని ధ్వజమెత్తారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు.

కేకే-ఓసీని సందర్శించిన డైరెక్టర్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే-ఓసీని సింగరేణి డైరెక్టర్(పీపీ) కే.వెంకటేశ్వర్లు సోమవారం ఏరియా జీఎం రాధాకృష్ణతో కలిసి సందర్శించారు. గనిలోని పని ప్రదేశాలు, వ్యూ పాయింట్‌ను సందర్శించి మైనింగ్ కార్యకలాపాలు పరిశీలించారు. గనిలో కన్వేయర్ ఆపరేటర్ దొమ్మటి రవీందర్ కుమారుడు ప్రవీణ్‌కుమార్ గ్రూప్ -1లో ఉత్తీర్ణుడై డిప్యూటీ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పోస్టుకు ఎంపిక కావడంతో గని ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏకే-ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లయ్య, ఇంజనీర్ వెంకటవంశీధర్, మేనేజర్ రామరాజు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నిరసన

నస్పూర్: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడిని ఖండిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి లింగంపల్లి శ్రీనివాస్‌మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి సుందిళ్ల మల్లేష్‌మాదిగ, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు చిప్పకుర్తి మల్లేశ్‌మాదిగ, నాయకులు మంతెన మల్లేశ్, నక్క అంజయ్య మాదిగ, సతీష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

డీసీసీ పీఠం ఎవరికో!

- 16న ఏఐసీసీ పరిశీలకుల రాక
- పార్టీ నాయకులతో అభిప్రాయాల సేకరణ
- జిల్లా నుంచి ముగ్గురి పేర్లతో జాబితా
- అధ్యక్ష పదవికి పోటీలో సీనియర్లు



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్ష పీఠానికి నాయకుల్లో పోటీ నెలకొంది. స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడడంతో అధికార కాంగ్రెస్ పార్టీలో సంస్థాగత ఎన్నికల సందడి మొదలైంది. ఇప్పటికే గ్రామాలు, మండలాలు, బ్లాక్ స్థాయిలో పదవుల్లో ఎంపిక కసరత్తు పూర్తయింది. ఇప్పటికే ఓ దఫా కసరత్తు జరిగింది. అయితే జిల్లా అధ్యక్ష బాధ్యతల అప్పగింతకు మరోసారి అభిప్రాయ సేకరణ జరగనుంది. ఈ నెల 16నుంచి ఏఐసీసీ పరిశీలకులు నరేశ్‌కుమార్ జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, నాయకులు, తాజా, మాజీ ప్రజాప్రతినిధులతోపాటు పార్టీ విభాగాలకు చెందిన వారితో జిల్లా కొత్త సారథిపై నేరుగా వివరాలు సేకరించనున్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకూ ఇన్‌చార్జిగా ఉన్న నేపథ్యంలో గత రెండ్రోజులుగా ఆ జిల్లా నాయకులతో అభిప్రాయాలు సేకరిస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా బాధ్యతలు అప్పగించేందుకు ముగ్గురు పేర్లతో జాబితా సిద్ధం చేసేందుకు పార్టీ కేడర్‌ను భాగస్వామ్యం చేసేలా పార్టీ నిర్ణయించింది.

ఆ ముగ్గురి పేర్లు ఎవరివో..?

గత పదేళ్లుగా ప్రతిపక్ష పార్టీగా ఉండి ప్రస్తుతం అధికారంలోకి రావడంతో పార్టీ పదవులపై గంపెడాశలు పెట్టుకున్నారు. రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవులు సైతం ఎవరికీ పెద్దగా దక్కలేదు. ఈ క్రమంలో సీనియర్ నాయకులు తమకు పదవులు ఇవ్వాలని కోరుతున్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు(పీఎస్సార్) వర్గీయులైన రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న దండేపల్లి మండలం కొత్త మామిడిపల్లికి చెందిన గడ్డం త్రిమూర్తి, నూకల రమేశ్ డీసీసీ అధ్యక్ష పదవి ఆశిస్తున్నారు. ఇక బెల్లంపల్లి నియోజకవర్గం నుంచి కార్మూరి రాంచందర్ పోటీలో ఉన్నారు. చెన్నూర్ నియోజకవర్గం నుంచి సీనియర్ నాయకుడిగా ఉన్న పిన్నింటి రఘునాథ్‌రెడ్డి డీసీసీ అధ్యక్ష బాధ్యతలు తనకే అప్పగించాలని కోరుతున్నారు. వీరితోపాటు పలువురు సీనియర్లు దరఖాస్తు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇక మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరాక తనకు పదవి దక్కలేదనే నిరాశలో ఉన్నారు. తనకు అవకాశం కల్పిస్తే జిల్లా బాధ్యతలు చూస్తానని చెబుతున్నారు. కాగా, ఏఐసీసీ పరిశీలకులు జిల్లా నుంచి అభిప్రాయాలు సేకరించిన తర్వాత ముగ్గురు పేర్లతో జాబితా పంపించనున్నారు.

సురేఖకు మళ్లీ అవకాశం కల్పించేనా?

ప్రస్తుతం డీసీసీ అధ్యక్షురాలిగా ఉన్న కొక్కిరాల సురేఖ సుమారు ఏడేళ్లుగా పార్టీ జిల్లా బాధ్యతలు చూస్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటి నుంచి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ప్రస్తుతం మరోసారి పార్టీ అధిష్టానం అవకాశం కల్పిస్తుందా..? లేదా..? అనేది తేలాల్సి ఉంది. డీసీసీ హోదాలో రెండుసార్లు కంటే ఎక్కువగా ఉండరాదు. ఈ క్రమంలో ఆమెకు బదులు ఎవరైనా కొత్త వారికి అవకాశం కల్పిస్తారా..? లేదా..? ఎమ్మెల్యే పీఎస్సార్‌కు మంత్రి పదవి రాకపోవడంతో ఆ లోటును ఇలా భర్తీ చేస్తారా..? అనేది పార్టీ అధిష్టానం నిర్ణయించనుంది.

ఎమ్మెల్యేల్లో కుదరని సఖ్యత

జిల్లాలో మూడు ప్రధాన నియోజకవర్గాలైన మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్‌లో ఎమ్మెల్యేలుగా పీఎస్సార్, వినోద్, మంత్రి వివేక్ ఉన్నారు. వీరంతా ఎవరికి వారే వర్గపోరుతో ఉన్నారు. మంత్రి పదవి విషయంలో మొదలైన రగడ మొన్నటి దేవాపూర్ సిమెంటు ఫ్యాక్టరీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల దాకా రగులుతూనే ఉంది. ఇప్పటికీ ముగ్గురు కలిసి ఏ వేదిక, కార్యక్రమం పంచుకోకపోగా.. సమీక్ష, సమావేశాలు నిర్వహించలేని పరిస్థితి ఉంది. జిల్లాలో మంత్రిగా వివేక్ ఉన్నప్పటికీ ఆయన కేవలం చెన్నూర్‌కే పరిమితం అవుతున్నారు. ఎవరికి వారే అన్నట్లుగా ఉన్న ఈ క్రమంలో కొత్తగా నియామకం అయ్యే డీసీసీ అధ్యక్ష స్థానానికి ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసే సమర్థులను ఎంపిక చేయాలని కార్యకర్తలు కోరుతున్నారు.

'మందు'కొడిగా దరఖాస్తులు

- జిల్లాలో 73 దుకాణాలకు 42 టెండర్లు
- పాత వ్యాపారుల ఎత్తుగడలు
- సిండికేటుగా ఏర్పడి దక్కించుకునే ప్రయత్నాలు


దరఖాస్తు సమర్పణ తర్వాత రశీదు అందజేస్తున్న ఎక్సైజ్ అధికారులు (ఫైల్)

మంచిర్యాలక్రైం: జిల్లాలో మద్యం దుకాణాలకు టెండర్ దరఖాస్తుల ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా కొత్త మద్యం పాలసీకి ప్రభుత్వం టెండర్లు ఆహ్వానిస్తోంది. జిల్లాలోని 73 మద్యం దుకాణాలకు గాను గత నెల 26 నుంచి ఎక్సైజ్ శాఖ అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ నెల 18 నాటితో దరఖాస్తు గడువు ముగియనుంది. ఇంకా నాలుగు రోజుల గడువు మాత్రమే ఉండగా.. ఇప్పటికీ అధికారులు ఆశించిన స్థాయిలో టెండర్లు రాకపోవడంతో ఎక్సైజ్ శాఖ అధికారులు ఆలోచనలో పడ్డారు. దరఖాస్తుల సంఖ్య పెరిగేలా ఆ శాఖ అధికారులు తమ పరిధి దాటి ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ నెల 11న రెండో శనివారం ప్రభుత్వ సెలవు దినం అయినప్పటికీ ఎక్సైజ్ అధికారులు పని దినంగానే ప్రకటించారు. 73 దుకాణాలకు గాను సోమవారం వరకు 42 టెండర్లు మాత్రమే రావడంతో అధికారులు తల పట్టుకుంటున్నారు. ఒక్కో దుకాణానికి ఒక్కటైనా రాకపోవడంతో.. ఎలాగైనా గతంలో కంటే ఎక్కువ సంఖ్యలో వచ్చేలా ఎవరి స్టేషన్ పరిధిలో వారీగా సీఐలు, ఎస్సైలు పాత వ్యాపారులు, కొత్తగా వ్యాపారంలోకి రావాలనే ఆలోచన కలిగిన వారిని ప్రోత్సహిస్తున్నారు. ఫోన్లు చేస్తూ, వాట్సాప్ ద్వారా ప్రచారం చేస్తూ ఇంకా నాలుగు రోజులే గడువు ఉందంటూ గుర్తు చేస్తున్నారు.

సిండికేటుకు యత్నాలు

జిల్లాలో గతంలో మద్యం వ్యాపారం చేసిన వారు, లిక్కర్‌డాన్‌లుగా పేరొందిన వారు దుకాణాలు దక్కించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. సిండికేటుగా ఏర్పడి ఆచితూచి దరఖాస్తులు వేస్తున్నారు. గతంలో ఒక్కో వ్యాపారి 20 నుంచి 50కి పైగా టెండర్లు సమర్పించగా.. ఇప్పుడు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోకుండా సులువుగా దుకాణాలు దక్కించుకునేలా సిండికేటుగా ఏర్పడి టెండర్లు వేస్తున్నట్లు సమాచారం. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడే అవకాశాలున్నాయి. దరఖాస్తు ఫీజు రూ.3లక్షలు ఉండడంతో పలువురు భాగస్వామ్యంతో టెండర్లు వేస్తున్నారు. లిక్కర్ వ్యాపారంలో ఏళ్ల తరబడిగా కొనసాగుతున్న మరికొందరు రూ.3లక్షలు పెద్ద లెక్క కాదని భావిస్తున్నారు. కానీ డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో మద్యం దుకాణాలు దక్కించుకోవాలని వ్యూహం పన్నుతున్నారు. ఈసారి ప్రభుత్వ ఉద్యోగులు, డాక్టర్లు, పోలీసు శాఖ, రెవెన్యూ శాఖలో పని చేసే ఉద్యోగులు బినామీ పేర్లతో టెండర్లు వేసేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. ఏదేమైనా టెండర్లు అధిక సంఖ్యలో వచ్చేందుకు వివిధ రకాలుగా ప్రచారం చేస్తున్నారు.

పెరిగిన ఫీజు, స్థానిక ఎన్నికలు కారణమా..?

మద్యం టెండర్ల నోటిఫికేషన్, స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడం, దసరా పండుగ రావడంతో చాలామంది రియల్టర్లు, మద్యం వ్యాపారులు ఎన్నికల బరిలో దిగేందుకు సిద్ధమయ్యారా..? లేక దసరా పండుగ తర్వాత వేద్దామనుకుని ఆగిపోయారా..? దరఖాస్తు ధర గతం కంటే రూ.లక్ష పెంచడంతో వెనుకడుగు వేశారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కారణం ఏమిటనే చర్చ జరుగుతోంది. గత టెండర్ల సమయంలో నాలుగు రోజుల గడువు ముందు వరకు సుమారు 500కు పైగా దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. అప్పట్లో జిల్లాలో 73 దుకాణాలకు గాను 2,242 టెండర్లు దాఖలయ్యాయి. ఈసారి ఆశించిన స్థాయిలో రాకపోవడంతో ఎక్సైజ్ శాఖ అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. చివరికి స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడడంతో ఈ నాలుగు రోజుల వ్యవధిలో ముహూర్తం చూసుకుని భారీగా టెండర్లు వేసే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా వివరాలు

స్టేషన్	దుకాణాలు	దరకాస్తులు
మంచిర్యాల	26	20
లక్సెట్టిపేట	12	10
బెల్లంపల్లి	25	06
చెన్నూర్	10	06
మొత్తం	73	42

మొక్కుబడిగా పోషణ మాసోత్సవం


లక్సెట్టిపేట ప్రాజెక్టు పరిధిలో ఇటీవల పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో రేష్మ

- అంతంత మాత్రంగానే అవగాహన కార్యక్రమాలు
- దసరా సెలవులు, బీఎల్‌వో విధులతో ఆటంకం
- చిన్నారుల్లో పోషకాహార లోపాలు

మంచిర్యాలటౌన్: చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల్లో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం ఏటా నిర్వహిస్తున్న పోషణ మాసోత్సవం జిల్లాలో మొక్కుబడిగా సాగుతోంది. గత నెల 17న ప్రారంభం కాగా.. ఈ నెల 16వరకు నిర్వహించాల్సి ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బూత్ లెవల్ అధికారులుగా అంగన్‌వాడీ టీచర్లకు అదనపు విధులు కేటాయించడం, దసరా పండుగకు సెలవుల నేపథ్యంలో పోషణ మాసం నిర్వహణకు ఆటంకం ఏర్పడింది. లక్సెట్టిపేట, బెల్లంపల్లి ప్రాజెక్టుల పరిధిలో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మంచిర్యాల, చెన్నూర్ ప్రాజెక్టుల పరిధిలో అంతంత మాత్రంగానే సాగుతోంది. జిల్లాలో 969 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 4,245మంది గర్భిణులు, 3,186 మంది బాలింతలు, 39,229మంది చిన్నారులు ఉన్నారు. 39,229 మంది చిన్నారులను పరీక్షించి 1,282మంది తీవ్ర పోషకాహార లోపం, 199మంది అతి తీవ్ర పోషకాహారలోపంతో బాధపడుతున్నట్లు గుర్తించారు. గర్భిణుల ఆరోగ్య రక్షణ, రక్తహీనత నివారణ, పిల్లల పెరుగుదల పర్యవేక్షణ, పరిశుభ్రత వంటి పలు అంశాలపై అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది. బాలికలకు పోషకాహారం ప్రాముఖ్యత, పౌష్టికాహారం లేకపోతే ఎదురయ్యే రుగ్మతలపై అవగాహన కల్పించాలి. కానీ ఈ ఏడాది పూర్తి స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించడం లేదు.

రోజుకో కార్యక్రమం

పోషణ మాసం పురస్కరించుకుని ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో నెల రోజులపాటు రోజుకో కార్యక్రమం చేపట్టాలి. గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజల భాగస్వామ్యంతోనే అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, పిల్లల ఎత్తు, బరువు, కొలతలు సేకరించడం, గర్భిణుల బరువు, భుజం కొలతలను తీసుకోవడం, పోషకాహారంపై అవగాహన కల్పించి, రోగ నిరోధక శక్తిని పెంచడంపై దృష్టి సారించాలి. చిన్నారుల గ్రోత్ మానిటరింగ్‌లో తక్కువ బరువు ఉన్న పిల్లలకు వైద్య పరీక్షలు, మందులు, బాలామృతం, బాలామృతం ప్లస్ పంపిణీ చేసి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలి. 'మీరు తినే ఆహారం మీ పెరుగుదల' అనే అంశంపై పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు, ఆహార సమూహాలు, విటమిన్లు, రక్తహీనత, పరిశుభ్రతపై పలు కార్యక్రమాలు నిర్వహించి, హ్యాండ్ వాష్ ప్రదర్శనలు, తల్లిదండ్రులతో సమావేశాలు, పిల్లల ఎదుగుదలకు అవసరమైన పౌష్టికాహారంపై నెలంతా కార్యక్రమాలు నిర్వహించాలి. నెలంతా ప్రతీ అంగన్‌వాడీ కేంద్ర పరిధిలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, సెక్టార్ల వారీగా కూడా చేపట్టకపోవడం, చివరి మూడు రోజుల్లో ప్రాజెక్టుల వారీగా ఒకేసారి నిర్వహించేలా అధికారులు ఏర్పాటు చేస్తుండడం గమనార్హం.

ప్రాజెక్టుల వారీగా అవగాహన



అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసాన్ని పురస్కరించుకుని ప్రతీ రోజు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉన్నా సెలవులు, ఇతర విధులతో కొన్ని సెంటర్లలో నిర్వహించలేదు. ప్రతీ ప్రాజెక్టు పరిధిలోని సెక్టార్ల పరిధిలో ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు నిర్వహించగా, ప్రాజెక్టుల వారీగా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశాం.
– రౌఫ్‌ఖాన్, జిల్లా సంక్షేమశాఖ అధికారి, మంచిర్యాల

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ కుమార్ దీపక్
- ప్రజావాణిలో అర్జీల స్వీకరణ

నస్పూర్: సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ చంద్రయ్య, మంచిర్యాల ఆర్డీఓ శ్రీనివాసరావుతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రజావాణిలో 43 దరఖాస్తులు అందాయని సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

- మంచిర్యాల కల్లుగీత కార్మిక సహకార సంఘం సొసైటీలో అక్రమాలపై చర్యలు తీసుకోవాలని, సంఘం రికార్డులు స్వాధీనం చేసుకోవాలని పాత మంచిర్యాలకు చెందిన కోల రాజగౌడ్ దరఖాస్తు అందజేశారు.
- భూ రికార్డుల్లో తప్పులు సవరించాలని మందమర్రి మండలం గద్దెరాగడికి చెందిన కట్కూరి దేవేందర్‌రెడ్డి వినతిపత్రం అందించారు.
- భీమారం మండలం పోతనపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీవాసులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు.
- బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామానికి చెందిన మంద అనిత తమ గ్రామంలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురి కాకుండా చూడాలని విన్నవించారు. అక్రమార్కులు రాత్రికి రాత్రే కబ్జా చేసి ప్లాటుగా మార్చి ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారని, ఇంటి నంబర్లు, విద్యుత్ కనెక్షన్లు తెచ్చి విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. పలు సర్వేనంబర్లలో ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనట్లు తెలిపారు. ప్రభుత్వ భూముల కబ్జాలను అడ్డుకున్న తన భర్త మాజీ సర్పంచ్ మంద రవి హత్యకు గురయ్యారని తెలిపారు.

వందేళ్ల సమస్య తీర్చిన కలెక్టర్‌కు సన్మానం


కలెక్టర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

నస్పూర్: జన్నారం మండలం మహ్మదాబాద్ గ్రామంలో వందేళ్ల భూసమస్యను పరిష్కరించిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్‌లో శాలువాతో ఘనంగా సన్మానించారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చింతగూడ శివారు సర్వేనంబరు 98లో 457 ఎకరాల భూమిని ప్రభుత్వం చింతగూడ, మహ్మదాబాద్ గ్రామస్తులకు అసైన్డ్ చేసింది. కానీ రికార్డుల్లో 457 ఎకరాలకు బదులు 658 ఎకరాలు చూపిస్తోంది. సుమారు 200 ఎకరాల భూమి ఎక్కువగా చూపిస్తుండడంతో ఆయా గ్రామాల్లోని భూ హక్కుదారులకు బదలాయింపులో సమస్యలు తలెత్తాయి. వారసులకూ హక్కులు సంక్రమించకుండా పోయాయి. కలెక్టర్ చొరవ చూపి ఎంజాయ్‌మెంటు సర్వేకు ఆదేశించి పూర్తయ్యేలా చూశారు. ఎలాంటి అభ్యంతరాలు లేకుండా పూర్తవడంతో వందేళ్లుగా పరిష్కారం కాని సమస్యకు పరిష్కారం చూపారని, 170 కుటుంబాలకు చెందిన భూ సమస్యను పరిష్కరించారని మహ్మదాబాద్ గ్రామస్తులు సోమవారం కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేసి శాలువాతో సన్మానించారు. కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి చట్టంలో భాగంగా రెవెన్యూ సదస్సుల్లో భూ సంబంధిత సమస్యలపై వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులు మొఖా, సర్వేనంబర్లు ఇతర పూర్తి వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

ఫైలేరియా వ్యాధి నిర్మూలిద్దాం


సర్వే ప్రారంభిస్తున్న జిల్లా వైద్యాధికారి అనిత

మంచిర్యాలటౌన్: జిల్లాలో ఫైలేరియా(బోదకాలు) వ్యాధిని పూర్తిగా నిర్మూలిద్దామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అనిత అన్నారు. జిల్లా కేంద్రంలోని రాళ్లపేట్‌లో ఫైలేరియా నియంత్రణపై టాస్-1 సర్వేను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఫైలేరియా నిర్ధారణకు ర్యాపిడ్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాతమంచిర్యాల అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యుడు శివప్రతాప్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనిల్, ఆరోగ్య కార్యకర్తలు సంతోశ్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడవచ్చు

మంచిర్యాలటౌన్: గుండె ఆగిన వ్యక్తికి వెంటనే సీపీఆర్ చేయడం వల్ల ప్రాణాలు కాపాడవచ్చని జిల్లా వైద్యాధికారి అనిత అన్నారు. సీపీఆర్ వారోత్సవాల్లో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమంలో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వైద్యులు శ్రీలత, ప్రత్యూష, కోటేశ్వర్‌రావు, సుధాకర్‌నాయక్, ప్రసాద్, శివప్రతాప్, 108 కోఆర్డినేటర్ సంపత్, డీపీవో ప్రశాంతి పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ సాధించేవరకు ఆందోళనలు


రాస్తారోకో చేస్తున్న బీసీ సంఘ నాయకులు

జన్నారం: బీసీలకు 42శాతం రిజర్వేషన్ సాధించే వరకు బీసీ కులాల ఉద్యమ పోరాట సమితి ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని ఆ సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ కొడూరి చంద్రయ్య, కోకన్వీనర్ కడార్ల నర్సయ్య అన్నారు. బీసీ సంఘాల పిలుపు మేరకు సోమవారం జన్నారంలో ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. సంఘం జిల్లా కన్వీనర్ ఆడేపు లక్ష్మీనారాయణ, మండల బీసీ సంఘం అధ్యక్షుడు గూడ అశోక్, మాజీ ఎంపీటీసీ రాగుల శంకర్, ప్రధాన కార్యదర్శి సంద గోపాల్, ఆంధ్ర పురుషోత్తం, గుడ్ల రాజన్న, నాయకులు పాల్గొన్నారు.

కరెంట్ కనెక్షన్ ఇచ్చారు..

సాక్షి ఎఫెక్ట్..

మంచిర్యాలఅగ్రికల్చర్: 'కరెంటు కనెక్షన్ లేదు' శీర్షికన ఈ నెల 11న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. మందమర్రి మండలం సారంగపూర్ గ్రామం శంకర్‌పల్లికి చెందిన రైతు జాడి పద్మ బోరు మోటారు కనెక్షన్ కోసం 2021 జూన్ 21న డీడీ చెల్లించింది. 2023లో విద్యుత్ ప్రజావేదికలో ఫిర్యాదుతో విద్యుత్ శాఖ సిబ్బంది స్తంభాలు వేసి వదిలేశారు. కరెంటు కనెక్షన్ కోసం కలెక్టరేట్, విద్యుత్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ఈ విషయమై కథనం ప్రచురితం కావడంతో సోమవారం విద్యుత్ అధికారులు స్పందించి కరెంటు తీగలు లాగి, కనెక్షన్ ఇచ్చారు. దీంతో రైతు కుటుంబం 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.


విద్యుత్ లైన్ వేస్తున్న సిబ్బంది

క్లుప్తంగా

తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు

నిర్మల్‌టౌన్: మద్యం సేవించి వాహనం నడిపిన ఒకరికి రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ నిర్మల్ న్యాయస్థానం తీర్పునిచ్చినట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలో సోమవారం పోలీసులు వాహనాల తనఖీ నిర్వహించారు. నర్సాపూర్‌కు చెందిన చిందం రమేశ్ మద్యం మత్తులో వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. నిర్మల్ కోర్టులో హాజరుపర్చగా ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

దాడి కేసులో నిందితుడి అరెస్టు

జైపూర్: మండలంలోని కుందారంలో ఒకరిపై దాడి కేసులో పరారీలో ఉన్న నిందితుడు మారెం అజయ్‌ను సోమవారం అరెస్టు చేసినట్లు శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్సై శ్రీధర్ తెలిపారు. కుందారంకు చెందిన దాసరి నరేశ్, మారెం అజయ్, బోగే ప్రశాంత్ చెడు వ్యసనాలకు బానిసై కొంతకాలంగా గ్రామంలో అల్లర్లు సృష్టించారు. ఈ నెల 4న రాత్రి గ్రామానికి చెందిన జక్కం అంజన్న ఇంటికి వచ్చి మూడు సీసీ కెమెరాలను పగుల గొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. అంజన్నపై దాడి చేసి పారిపోయారు. ఏ–3గా ఉన్న అజయ్‌ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

దొంగతనం కేసులో ఒకరు..

జైనథ్:మండలంలోని దీపాయిగూడలోదుర్ల రాజలింగు ఇంట్లో చోరీ కేసులో పోలీసులు 24 గంటల వ్యవధిలో నిందితున్ని పట్టుకున్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో సీఐ శ్రవణ్ కుమార్ వివరాలు వెల్లడించారు. ఆదివారం దీపాయిగూడ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒకరి వద్ద రూ.25 వేల నగదు, మూడు తులాల బంగారం లభించాయి. అనుమానం వచ్చి అదుపులోకి తీసుకుని విచారించగా చోరీకి పాల్పడినట్లు అంగీకరించాడు. ఎస్సై గౌతమ్ పవర్, సిబ్బందిని సీఐ అభినందించారు.

చోరీకి యత్నించిన నిందితుడి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని గాంధీ కూడలిలో ఏ–1 ట్రేడర్స్ దుకాణం ముందు నుంచి మిక్సీ చోరీకి యత్నించిన నిందితుడిని అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. దుకాణం ముందు పెట్టిన మిక్సీని దొంగిలించేందుకు యత్నించగా యజమాని సల్మాన్ హుస్సేన్ వెంబడించి పట్టుకున్నారు. సల్మాన్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

ద్విచక్ర వాహనం చోరీ

ఇంద్రవెల్లి: మండల కేంద్రానికి చెందిన డోంగ్రె పృథ్వీరాజ్ ఈ నెల 11న రాత్రి తన ద్విచక్ర వాహనాన్ని ఇంటిముందు నిలిపి ఉంచగా గుర్తు తెలియని దుండగులు అపహరించారు. తెలిసిన చోట వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ఈ.సాయన్న తెలిపారు.

పత్తిచేలపై అడవిపందుల దాడి



పంటలను పరిశీలిస్తున్న అధికారులు

కోటపల్లి: నాగంపేట గ్రామ శివారులోని పత్తి పంటలపై సోమవారం అడవిపందులు దాడి చేసి ధ్వంసం చేశాయి. రైతులు ఫారెస్టు అధికారులకు సమాచారం అందించగా పరిశీలించేందుకు వచ్చిన అధికారుల దృష్టికి తమ సమస్యలను తీసుకవెళ్లారు. అడవిపందులను చంపితే కేసులు పెడతామని హెచ్చరించే అధికారులు పంటలు నాశనం చేస్తే మరి మా పరిస్థితి ఏంటని ఆందోళనకు దిగారు. ఎస్సై రాజేందర్ వ్యవసాయాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో రైతులు సద్దుమణిగారు. వ్యవసాయాధికారి సాయికృష్ణ, ఏఈవో వైష్ణవి పంటలను పరిశీలించి పంచనామా నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. అనంతరం రైతులు తహసీల్దార్ రాఘవేందర్‌రావుకు వినతిపత్రం ఇచ్చారు.

రాష్ట్ర అధికార ప్రతినిధిగా సతీష్

బెల్లంపల్లి: సమాచార హక్కు చట్టం సాధన కమిటీ (ఆర్‌టీఐ) రాష్ట్ర అధికార ప్రతినిధిగా బెల్లంపల్లికి చెందిన కాశీ సతీష్ కుమార్ నియామకమయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన సమాచార హక్కు చట్టం ఆవిర్భావ దినోత్సవంలో వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి హాజరై సతీష్ నియామకాన్ని ప్రకటించారు.

యువతి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: జైనథ్ మండలంలోని కూర గ్రామానికి చెందిన యువతి (19) అదృశ్యమైంది. ఈనెల 10న బతుకమ్మ వేడుకలకు ఆదిలాబాద్ పట్టణంలోని తన మామయ్య ఇంటికి వచ్చింది. ఆదివారం ఆ యువతిని కూర గ్రామానికి వెళ్లేందుకు ఆదిలాబాద్ బస్టాండ్‌లో ఆయన వదిలిపెట్టి వెళ్లాడు. సోమవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తాను తిరుపతికి వెళ్తున్నానని చెప్పి ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజు తెలిపారు.

సంక్షోభంలో శ్రీరాంపూర్ ఓసీపీ

- చేతులెత్తేసిన ఓబీ సంస్థలు
- నిలిచిన మట్టి వెలికితీత పనులు
- పడిపోయిన బొగ్గు ఉత్పత్తి



శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్టు గని

శ్రీరాంపూర్: సింగరేణి సంస్థలో ఎక్కడా లేని విధంగా శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గని (ఓసీపీ) తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. ఓబీ (మట్టి వెలికితీత) పనులు చేసే రెండు కాంట్రాక్టు సంస్థలు చేతులెత్తేయడంతో బొగ్గు ఉత్పత్తి ఆగిపోయింది. ఓబీ వెలికితీత టెండర్‌ను సీఆర్ఆర్, జీవీఆర్ సంస్థలు దక్కించుకున్నాయి. నాలుగేళ్ల నిర్దేశిత ఓబీ వెలికితీసేలా ఒప్పందం చేసుకున్నాయి. 2022 డిసెంబర్ 1 నుంచి సీఆర్ఆర్ పనులు చేపట్టింది. 2023 అక్టోబర్ 1 నుంచి జీవీఆర్ పనులు ప్రారంభించింది. సీఆర్ఆర్ సంస్థ 720 లక్షల క్యూబిక్ మీటర్లు తీయాల్సి ఉండగా అక్టోబర్ 1 వరకు 360 లక్షల క్యూబిక్ మీటర్లు మాత్రమే వెలికితీసింది. ఇక జీవీఆర్ సంస్థ 495 లక్షల క్యూబిక్ మీటర్లు తీయాల్సి ఉండగా 220 లక్షల క్యూబిక్ మీటర్లు మాత్రమే తీసింది.

నష్టాలు వస్తున్నాయని..

నష్టాలు వస్తున్నాయని ఆ రెండు సంస్థలు అర్ధంతరంగా పనులు నిలిపివేశాయి. సీఆర్ఆర్ ఆగస్టు 27 నుంచి, జీవీఆర్ అక్టోబర్ 1 నుంచి పనులు చేయడం లేదు. టెండర్ ప్రకారం నాలుగేళ్ల కాలానికి నిర్దేశించిన ఓబీ తీయాల్సి ఉండగా తమతో ఇక కాదని చేతులెత్తేశాయి. జీవీఆర్ సంస్థ ముందుగా నోటీసులు ఇచ్చి పనులు బంద్ చేయగా, సీఆర్ఆర్ సంస్థ చెప్పా పెట్టకుండానే పనులు నిలిపివేసింది. ఈ సంస్థకు కంపెనీ పలుమార్లు నోటీసులు ఇచ్చింది. ఇదిగో వస్తాం.. చేస్తాం.. అంటూ తప్పించుకున్నారు. చేసేది లేక యాజమాన్యం సీఆర్ఆర్‌ను టెర్మినేట్ చేసేలా నోటీసులు ఇచ్చింది. టెండర్ నిబంధనలకు విరుద్ధంగా అధిక డీజిల్ వినియోగంపై సీఆర్ఆర్‌కు రూ.57 కోట్లు, జీవీఆర్‌కు రూ.27 కోట్లు మొత్తంగా రూ.84 కోట్లు సింగరేణి యాజమాన్యం జరిమానా విధించింది. పనుల నిలిపివేతకు ఈ జరిమానాలు కూడా ఒక కారణమని తెలుస్తోంది.

రోజుకు 12 వేల టన్నుల నష్టం..

ఓబీ సంస్థల నిర్వాహకంతో ఓసీపీలో రోజుకు 12 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి నష్టం జరుగుతోంది. రోజుకు రూ.కోటి వరకు నష్టపోతోంది. టెండర్ సమయంలో అధికారులు ఓబీ సంస్థల సామర్థ్యాన్ని అంచనా వేయకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. కాగా, ఓబీ సంస్థలు చేతులెత్తేయడంతో సింగరేణి సొంతంగా ఓబీ పనులు చేపడుతోంది. సంస్థ ఉద్యోగులతో 3 షావల్స్‌తో ఓబీ వెలికితీస్తున్నా.. రోజుకు కనీసం 5 వేల క్యూబిక్ మీటర్లు కూడా తీయలేకపోతోంది. మరోవైపు కాంట్రాక్టర్‌తో ఓబీ తీస్తే క్యూబిక్ మీటర్‌కు రూ.135 ఖర్చయితే నేడు కంపెనీ ఇందుకు రూ.400 ఖర్చు చేయాల్సి వస్తోంది. ఓసీపీలో ఏప్రిల్ 1 నుంచి అక్టోబర్ 1 వరకు 16.09 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉండగా 14.58 లక్షల టన్నులు మాత్రమే వెలికితీశారు. 83 శాతం లక్ష్యం సాధించారు. సమస్య పరిష్కరించి ఓబీ, బొగ్గు ఉత్పత్తి పెంచకుంటే సంస్థ తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది.

నిత్యం ఆందోళనలు

సీఆర్ఆర్ కాంట్రాక్టు సంస్థ నాలుగు నెలలుగా వేతన బకాయిలు రూ.4 కోట్లు చెల్లించకపోవడంతో కార్మికులు నిత్యం ఆందోళనలు చేస్తున్నారు. వాహనాల నిలిపివేత, ఆత్మహత్యాయత్నాలు, అధికారుల ఘెరావ్‌లతో గని ఉద్రిక్తంగా మారింది. వేతనాలు చెల్లించకుంటే గనిని పూర్తిగా మూసి వేస్తామని హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం పోలీసుల పహారాలో ఓసీపీ నడుస్తోంది. వేతనాలు చెల్లించకుంటే మరో రెండు రోజుల్లో అధికారుల కార్యాలయాలకు తాళం వేస్తామని కార్మికులు అల్టిమేటం ఇచ్చారు.

కొత్త టెండర్లు పిలిచాం..

జీవీఆర్ సంస్థ స్థానంలో మరో సంస్థ కోసం కొత్త టెండర్ పిలిచాం. రెండు మూడు నెలల్లో పనులు మొదలవుతాయి. ఇక సీఆర్ఆర్ సమస్య పరిష్కరించి, దానికి కూడా టెండర్ పిలుస్తాం. ఈ విషయమై ఉన్నతాధికారులతో చర్చిస్తున్నాం. రెండు టెండర్లు పూర్తయితే పనులు పుంజుకుంటాయి. అప్పటి వరకు కంపెనీ ఆధ్వర్యంలో ఓబీ వెలికితీస్తూ వీలైనంత బొగ్గు ఉత్పత్తి చేస్తాం. – చిప్ప వెంకటేశ్వర్లు, ప్రాజెక్టు అధికారి, ఎస్సార్పీ ఓసీపీ

ఐటీడీఏ ఎదుట 72 గంటల నిరసన



మాట్లాడుతున్న పూసం సచిన్

ఉట్నూర్‌రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న డైలీవైజ్, ఔట్‌సోర్సింగ్ వర్కర్లు చేపట్టిన సమ్మె 32వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా సోమవారం యూనియన్ జేఏసీ పిలుపు మేరకు ఐటీడీఏ కార్యాలయం ఎదుట 72 గంటలపాటు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ మాట్లాడుతూ వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించడంతో పాటు టైం స్కేల్ వేతనాలు ఇవ్వాలని, కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించాలని, వారసత్వ ఉద్యోగాలు, తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, ఉపాధ్యక్షుడు వెలిశాల కృష్ణమాచారి, టీఏజీఎస్ నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొడసం శంభు, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, తొడసం వసంత్‌రావు, అడ శ్యాంరావు, రాంబాయి, తదితరులు పాల్గొన్నారు.

నాయకుల అరెస్టుతో స్వల్ప ఉద్రిక్తత

ఉట్నూర్‌రూరల్: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని చేపట్టిన నిరసన రాత్రి వరకు కొనసాగింది. ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సమస్య విన్నవించి వెళ్లాలని చెప్పినా యధావిధిగా కొనసాగించారు.. దీంతో పోలీసులు పలువురిని స్టేషన్‌కు తరలించగా నాలుగో తరగతి ఉద్యోగులు ఐటీడీఏ ద్వారం వద్ద ధర్నాకు దిగారు. తమ నాయకులను పోలీసులు విడిచి పెట్టడంతో శాంతించారు.

వేటకు అమర్చిన విద్యుత్ తీగ తగిలి ఒకరు మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

పెంబి: వన్యప్రాణులను వేటాడేందుకు అమర్చిన విద్యుత్ తీగ తగిలి ఒకరు మృతి చెందిన సంఘటన నిర్మల్ జిల్లా పెంబి మండలంలో జరిగింది. ఖానాపూర్ సీఐ అజయ్, ఎస్సై హన్మాండ్లు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెంబితండా గ్రామ పంచాయతీ పరిధిలోని ఆక్టోనిమాడ గ్రామ సమీప అటవీ ప్రాంతంలో వన్యప్రాణులను వేటాడేందుకు పస్పుల తండా గ్రామానికి చెందిన ఆత్రం రాజు ఈ నెల 11న విద్యుత్ తీగ ఏర్పాటు చేశారు. దాదాపుగా 400 మీటర్ల దూరం విద్యుత్ కంచె అమర్చాడు. పెంబిలో మేకల కాపరిగా పనిచేస్తున్న ఆక్టోనిమాడ గ్రామానికి చెందిన ఆత్రం లింబారావు (29)శనివారం సాయంత్రం మేకలను కొట్టంలోకి పంపి ఇంటికి బయల్దేరాడు. ఆదివారం ఉదయం మేకలను తీసుకెళ్లేందుకు లింబారావు రాకపోవడంతో యజమాని కుటుంబ సభ్యులను ఆరా తీశాడు. శనివారం సాయంత్రం ఇంటికి కూడా రాలేదని చెప్పడంతో ఆందోళన చెందిన యజమాని, బాధిత కుటుంబ సభ్యులు సమీప ప్రాంతంలో వెతికారు. గ్రామానికి చెందిన పశువుల కాపరికి కాలిపోయిన మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా లింబారావుగా గుర్తించారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. సంఘటన స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహం అప్పగించారు. విద్యుత్ కంచె ఏర్పాటు చేసిన రాజు పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు.

ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ప్రజావాణి దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యలపై అర్జీదారుల నుంచి వచ్చిన దరఖాస్తులు స్వీకరించారు. ఆర్‌వోఎఫ్ఆర్ పట్టా మంజూరు చేయాలని మందమర్రికి చెందిన అమృత, ఉపాధి కల్పించాలని నార్నూర్ మండలం భీంపూర్‌కు చెందిన తిరుపతి, ఉమ్రికి చెందిన సునీల్ ఎంబీబీఎస్ చదువులకు ఫీజు మంజూరు చేయాలని, ఆసిఫాబాద్‌కు చెందిన సువర్ణ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, గాదిగూడ మండలం రాయిగూడకు చెందిన ఆత్రం సునీబాయి సోలార్ యూనిట్ ఇప్పించాలని కోరారు. అనంతరం పీవో ఈ నెల 17 నుంచి గుడిరేవులో గల ఆదివాసుల ఆరాధ్య దైవం పద్మల్‌పూరి కాకో ఏత్మాసూర్ ఆలయ ప్రాంగణంలో జరగనున్న గుస్సాడీ, దండారీ, దర్బార్ ఉత్సవాలకు సంబంధించిన గోడ ప్రతులు, ఆహ్వాన పత్రికలు ఆవిష్కరించారు.

మంత్రాల పేరుతో బాలికపై లైంగిక వేధింపులు

ఆదిలాబాద్‌టౌన్: మంత్రాల పేరుతో బాలికను లైంగికంగా వేధించిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలా బాద్ పట్టణంలోని ఓ కాలనీకి చెందిన బాలిక ఆరోగ్యం సరిగా లేకపోవటంతో కుటుంబ సభ్యులు గాదిగూడ మండలం మారెగాంకు చెందిన షేక్ కలీంను సంప్రదించారు. బాలికను పరిశీలించి దుష్టశక్తి సోకిందని నమ్మించాడు. బాలికను నిర్మల్ మండలం సోన్ వద్ద గల గోదావరి వద్దకు తీసుకెళ్లి పూజలు చేసి తీసుకొచ్చాడు. రెండు రోజుల క్రితం ఇంట్లో ఒంటరిగా అమ్మాయితో కొన్ని పూజలు చేయాలని నమ్మబలికి గదిలోకి తీసుకెళ్లి లైంగికంగా వేధించాడు. విషయాన్ని ఆమె కుటుంబ సభ్యులకు తెలుపడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో కేసు, బ్లాక్ మ్యాజిక్ రెమెడీస్ యాక్ట్, మోసం తదితర కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

గోదావరిలో చిక్కుకున్న ఇద్దరు యువకులు



యువకుడిని తీసుకువస్తున్న దృశ్యం

కడెం: మండలంలోని లక్ష్మీసాగర్ గ్రామ సమీపంలోని గోదావరిలో చిక్కుకున్న ఇద్దరు యువకులను గ్రామస్తులు కాపాడారు. మండలంలోని మద్దిపడగ గ్రామానికి చెందిన రాజ్‌కుమార్, రాజేశ్ సోమవారం లక్ష్మీసాగర్ గోదావరి రేవులో చేపలు పట్టేందుకు వెళ్లారు. ఎస్సారెస్పీ వరద గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయడంతో చుట్టూ నీళ్లు చేరాయి. దీంతో కుర్రులో ఉన్న యువకులు లక్ష్మీసాగర్ గ్రామస్తులకు సమాచారం అందించారు. గ్రామస్తులు గజ ఈతగాడి సహాయంతో కుర్రులో చిక్కుకున్న యువకులను తెప్పపై బయటకు తీసుకొచ్చారు.

కబడ్డీ జట్టుకు ఘన స్వాగతం



క్రీడాకారులను అభినందిస్తున్న డీఐఈవో అంజయ్య, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బాబురావు

మంచిర్యాలఅర్బన్: ఎస్‌జీఎఫ్ అండర్–19 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో తృతీయ స్థానం సాధించిన ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు క్రీడాకారులకు సోమవారం మంచిర్యాలలో ఘన స్వాగతం పలికారు. ఈ నెల 10 నుంచి 12 వరకు మహబూబాబాద్ జిల్లాలోని కొమ్ములవంచలో నిర్వహించిన పోటీల్లో మహబూబ్‌నగర్ (ప్రథమ) మెదక్ (ద్వితీయ) స్థానంలో నిలవగా ఆదిలాబాద్ జట్టు తృతీయ స్థానం సాధించింది. ప్రతిభ కనబరిచి మంచిర్యాలకు వచ్చిన జట్టు సభ్యులు, కోచ్ మేనేజర్లు సాంబమూర్తి, రాజన్న, సుదీప్‌లను మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో అభినందించారు. కార్యక్రమంలో డీఐఈవో అంజయ్య, పాఠశాల, కళాశాల గేమ్స్ కార్యదర్శి బాబురావు, కబడ్డీ అసోసియేషన్ సభ్యులు రాంచందర్, కార్తీక్, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అటవీశాఖ స్పోర్ట్స్ మీట్



బహుమతి ప్రదానం చేస్తున్న జిల్లా జడ్జి శ్రీవాణి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో అటవీశాఖ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహించిన స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ఆదివారం రాత్రి అట్టహాసంగా ముగిసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా జడ్జి శ్రీవాణి, అటవీశాఖ బాసర సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ శర్వానన్ హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పోటీల్లో నిర్మల్, నిజామాబాద్, ఆదిలాబాద్, జగిత్యాల జిల్లాలకు చెందిన సుమారు 350 మంది అటవీశాఖ క్రీడాకారులు పాల్గొనగా 35 రకాల క్రీడలు నిర్వహించారు. టగ్ ఆఫ్ వార్ పురుషుల విభాగంలో నిర్మల్ జట్టు, మహిళల విభాగంలో ఆదిలాబాద్ జట్టు విజేతగా నిలిచాయి. వాలీబాల్‌లో ప్రథమ విజేతగా ఆదిలాబాద్, రన్నర్ అప్‌గా నిర్మల్ జట్టు, క్రికెట్‌లో నిజామాబాద్ జట్టు, కబడ్డీ పురుషుల విభాగంలో నిజామాబాద్, మహిళల విభాగంలో నిర్మల్ జట్టు, త్రో బాల్ మహిళల విభాగంలో ఆదిలాబాద్ జట్టు, మార్చ్‌ఫాస్ట్‌లో నిర్మల్ జట్టు విజేతగా నిలిచాయి. ఓవరాల్ ఛాంపియన్స్ ట్రోఫీని నిర్మల్ జట్టు కైవసం చేసుకుంది. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ డీఎఫ్‌వో వికాస్ మీనా, నిర్మల్ డీఎఫ్‌వో నాగిని భాను, అధికారులు సుధాకర్‌రావు, శివకుమార్, నాలుగు జిల్లాల అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మారథాన్‌లో రాణిస్తున్న పద్మ



మెడల్‌తో పద్మ

బెల్లంపల్లి: ఆరోగ్యాన్ని మించిన మహాభాగ్యం మరొకటి లేదు. ఆ విషయాన్ని గ్రహించిన బెల్లంపల్లికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు సోమిశెట్టి పద్మ తన ఆరోగ్యంకోసం నడకను ప్రారంభించింది. క్రమం తప్పకుండా కొనసాగిస్తూనే మారథాన్‌లో పోటీపడే స్థాయికి చేరుకుంది. గతేడాది హైదరాబాద్‌లో, కరీంనగర్‌లో నిర్వహించిన మారథాన్‌లో పాల్గొని పట్టు సాధించింది. ఈ ఏడాది సెప్టెంబర్ 11న రాష్ట్ర సివిల్ సర్వీస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో 5కే ఈవెంట్‌లో పాల్గొని జాతీయస్థాయికి ఎంపికైంది. ఈ నెల 12న కరీంనగర్‌లో నిర్వహించిన హాఫ్ మారథాన్‌లో 21కేలో పాల్గొని ద్వితీయ బహుమతి సాధించింది. 28 నిమిషాల్లో 5కేను పూర్తి చేసింది. గంట 4 నిమిషాల్లో 10 కేను, 2 గంటల 8 నిమిషాల్లో 21కే చేరుకుని నిర్వాహకుల ప్రశంసలు అందుకుంది.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

తానూరు: ఆగస్టు 31న అదృశ్యమైన ఎల్వి గ్రామానికి చెందిన పన్నెవాడ్ లక్ష్మణ్ (56) మృతదేహం సోమవారం గ్రామ సమీపంలోని చెక్‌డ్యాంవద్ద గోనెసంచిలో లభించినట్లు ఎస్సై షేక్ జుబేర్ తెలిపారు. సోమవారం ఎల్వి గ్రామ సమీపంలోని చెక్‌డ్యామ్ వద్ద మేకల కాపరులు మృతదేహాన్ని గమనించి గ్రామస్తులకు సమాచారం అందించారు. పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై షేక్ జుబేర్ అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతుడు కొలుకు చేసిన భూమి సమీపంలో సంచిని వెలికితీయగా అందులో రుమాలుతో పాటు మెడలో వేసుకున్న మాల లభించింది. వాటి ఆధారంగా పోలీసులు పన్నెవాడ్ లక్ష్మణ్‌గా గుర్తించారు.

ఘటన స్థలాన్ని పరిశీలించిన ఏఎస్పీ ..

భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, ముధోల్ సీఐ మల్లేశ్ మృతదేహాన్ని పరిశీలించి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించారు. మృతుని భార్య పన్నెవాడ్ గంగామణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై షేక్ జుబేర్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకుడు మృతి

తానూరు: మండలంలోని దర్మాబాద్ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకుడు మాల్వే ఎంకోబా (70) మృతి చెందినట్లు ఎస్సై షేక్ జుబేర్ తెలిపారు. మృతుడు కొన్ని రోజులుగా తానూరు మండలంలో భిక్షాటన చేసుకుంటున్నాడు. ఆదివారం రాత్రి రోడ్డుపై పడుకుని ఉండగా గుర్తు తెలియని వాహనం అతనిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై షేక్ జుబేర్ సోమవారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ముధోల్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుని కుమారుడు మాల్వే బాలాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

జ్వరంతో ఇంటర్ విద్యార్థిని..

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వెంకటాపూర్‌కు చెందిన చిట్టవేణ అశ్విత (17) పది రోజుల క్రితం దసరా సెలవులకు అమ్మమ్మ ఊరైన బెల్లంపల్లి మండలంలోని ఆకెనపెల్లికి వెళ్లింది. మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతుండగా మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం

బెజ్జూర్: పురుగు మందు తాగి ఒకరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని మర్థిడిలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్థిడికి చెందిన బోర్‌కుట్ మల్లయ్యకు ఇటీవల అదే గ్రామానికి చెందిన మన్నెంపెల్లి ఓనయ్య దంపతులతో గొడవ జరిగింది. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మల్లయ్యపై ఈనెల 9న కేసు నమోదైంది. దీంతో భయాందోళనకు గురై సోమవారం ఉదయం గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇదిలా ఉండగా నా ఆత్మహత్యకు మాజీ ఎమ్మెల్యే అనుచరుడు బషరత్ ఖాన్ కారణమంటూ బాధితుడు పోస్ట్ చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ విషయమై ఎస్సై సర్దాజ్ పాషాను సంప్రదించగా అతనిపై ఈనెల 9న కేసు నమోదు కావడంతో నోటీసు ఇవడానికి పోలీసు సిబ్బంది ఇంటికి వెళ్లినట్లు తెలిపారు. ఆత్మహత్యాయత్నానికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

దాడులకు దారితీసిన ఆస్తుల పంచాయితీ

జైపూర్: అన్నదమ్ముల మధ్య ఆస్తుల పంచాయితీ చివరకు దాడులకు దారితీసింది. జైపూర్ మండలంలోని వేలాలకు చెందిన ప్యాగ మైసయ్య, రాజసమ్మయ్య ఇద్దరు అన్నదమ్ములు. మైసయ్యకు ముగ్గురు కుమారులు సమ్మయ్య, నాగయ్య, మల్లేశ్. వ్యవసాయం చేసుకుంటూ గ్రామంలోనే ఉంటున్నారు. రాజసమ్మయ్యకు శ్రీనివాస్, సంతోశ్ కుమారులు. శ్రీనివాస్ సింగరేణిలో ఓవర్‌మెన్ ఉద్యోగం చేస్తుండగా సంతోశ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. మైసయ్య, రాజసమ్మయ్యకు చెందిన భూమి, ఆస్తుల విషయంలో కొంతకాలంగా వివాదాలు జరుగుతున్నాయి. మైసయ్య వేలాలలో ఇల్లు నిర్మించుకుంటుండగా రాజసమ్మయ్య, అతని కుమారులు అడ్డుకున్నారు. ఇదే విషయంపై ఆదివారం గొడవ చోటు చేసుకోగా ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారు. దాడిలో శ్రీనివాస్, సంతోశ్, రాజసమ్మయ్య భార్య మల్లక్కకు గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. ఈ మేరకు రాజసమ్మయ్య ఫిర్యాదు మేరకు సమ్మయ్య, నాగయ్య, మల్లేశ్, లక్ష్మిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

మళ్లీ బెబ్బులి అలజడి

- దహెగాం మండలంలో పెద్దపులి సంచారం
- మరో 20 రోజుల్లో పత్తి తీత పనులు ప్రారంభం
- ఆందోళనలో సమీప గ్రామాల ప్రజలు



పులి పాదముద్రలు గుర్తిస్తున్న అటవీశాఖ అధికారులు

దహెగాం: రెండు సంవత్సరాలుగా పులి అలజడి లేక దహెగాం మండలం స్తబ్దతగా ఉంది. ఇటీవల మండలంలోని బీబ్రా, పెసరికుంట గ్రామాల సమీపంలో పంట చేలలో పులి పాదముద్రలు కనిపించడంతో రైతులు, సమీప గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సోమవారం పెసరికుంట బస్టాప్ సమీపంలో పంట పొలాల వద్ద పులి పాదముద్రలు గమనించిన రైతులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. టైగర్ ట్రాకింగ్ టీం సభ్యులు గ్రామానికి చేరుకుని పరిశీలించి పులి పాదముద్రలేనని నిర్ధారించారు. పులి ఎటు వైపు వెళ్లిందోనని సభ్యులు ట్రాకింగ్ చేపట్టారు. పెసరికుంట, బీబ్రా వైపు వచ్చింది కొత్త పులి అని అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు. మహారాష్ట్ర నుంచి సిర్పూర్(టీ), కడంబా, ఈస్‌గాం మండలం సార్సాల మీదుగా బీబ్రా వైపు వచ్చిందని, బీబ్రా నుంచి భీమిని మండలం చినగుడిపేట వైపు వెళ్లినట్లు అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు. కాగా మండలంలోని మురళీగూడ, పోలంపల్లి, జెండాగూడా, దుబ్బగూడ గ్రామాల ప్రజలు, రైతులు భయాందోళన చెందుతున్నారు.

మరో ఇరవై రోజుల్లో పత్తి తీత పనులు..

మరో ఇరవై రోజుల్లో మండలంలో పత్తి తీత పనులు ముమ్మరం కానున్నాయి. పులి సంచారంతో రైతులు, కూలీలు భయాందోళన చెందుతున్నారు. 2021 నవంబర్‌లో దహెగాం మండలంలోని దిగిడ గ్రామానికి చెందిన సిడాం విగ్నేష్, పెంచికల్‌పేట్ మండలం కొండపల్లి గ్రామానికి చెందిన మహిళా కూలీ, 2023 నవంబర్‌లో వాంకిడి మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన ఒకరు, ఈస్‌గాం మండలం నజ్రుల్ నగర్ వద్ద మహిళ పెద్దపులి దాడిలో మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రతీ సంవత్సరం పత్తి తీత పనులు ప్రారంభ సమయంలో పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది. అటవీశాఖ అధికారులు స్పందించి పులి బారి నుంచి రక్షణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఘన్‌పూర్ అడవిలో పెద్దపులి సంచారం



పులి పాదముద్ర

బోథ్: సొనాల మండలంలోని ఘన్‌పూర్, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో కొంతకాలంగా పెద్దపులి సంచరిస్తుంది. ఇప్పటికే రెండు ఆవులను హతమార్చింది. సోమవారం ఎఫ్ఆర్‌వో ప్రణయ్ కుమార్ సిబ్బందితో కలిసి అడవిలో తిరిగి పులి పాదముద్రలను సేకరించారు. వృద్ధులు, పశువుల కాపర్లు అడవుల్లోకి వెళ్లవద్దని సూచించారు. చేనుల్లో విద్యుత్ కంచెలను ఏర్పాటు చేయవద్దని హెచ్చరించారు.

నిందితున్ని పట్టించిన హంటర్ డాగ్



హంటర్ డాగ్‌తో తనిఖీ చేస్తున్న సిబ్బంది

దండేపల్లి: మండలంలోని తానిమడుగు ఫారెస్ట్ బీట్ 394 కంపార్ట్ మెంట్‌లో ఇటీవల టేకుచెట్లు నరికివేతకు గురైనట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. ఆదివారం హంటర్ డాగ్‌తో అడవిలో తనిఖీలు నిర్వహించారు. లభించిన ఆధారాలను వాసన చూసిన హంటర్ డాగ్ తానిమడుగులోని పెందూర్ రాజేశ్ ఇంటికి చేరుకుంది. అతని ఇంట్లో తనిఖీ చేయగా కలప లభించడంతో అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి లక్సెట్టిపేట కోర్టులో హాజరు పర్చగా 12 రోజుల రిమాండ్ విధించినట్లు తాళ్లపేట ఎఫ్ఆర్వో సుష్మారావు తెలిపారు.